క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య పరీక్షలు

శాయంపేట : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో లేబర్ కార్డు కలిగివున్న లబ్ధిదారులకు ఆదివారం 50 రకాలకుపైగా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ కందగట్ల రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లేబర్ కార్డు కలిగిన ప్రతిఒక్కరూ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహించే వైద్య శిబిరానికి తరలిరావాలని కోరారు. ఆధార్ కార్డు, లేబర్‌కార్డు జిరాక్స్ వెంటతీసుకు రావాలని సూచించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ



కమలాపూర్ : తెలంగాణ రాష్ట్రస్థాయి పదో జూనియర్, సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఇటీవల పదోతరగతి పూర్తి చేసిన మౌటం సంగీత రెండు పతకాలు సాధించినట్లు ఎంఈఓ రాంకిషన్‌రాజు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎస్వీ రంగనాథ్ తెలిపారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 6, 7వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి చాంపియన్ షిప్‌లో సంగీత అత్యంత ప్రతిభ కనబర్చి డిస్కస్ త్రోలో రజత పతకం, జావెలిన్ త్రోలో వెండి పతకం సాధించినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చి రెండు పతకాలు సాధించిన సంగీతతో పాటు పీఈటీ కృష్ణమూర్తిని ఆర్‌యూపీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.అబ్దుల్లా, ఉపాధ్యాయులు సంజీవరెడ్డి, అన్నపూర్ణ, రమేశ్, చంద్రమోహన్‌రెడ్డి, నీలాదేవి, అలీ, వాసు, సారయ్య, రజితతో కలిసి వారు అభినందించారు. బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని సంగీత.. రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి రెండు పతకాలు కైవసం చేసుకోవడం పాఠశాలకు, గ్రామానికి గర్వకారణమన్నారు. బాలికలు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలని సూచించారు.

ఎమ్మెల్యే పరామర్శ



ఐనవోలు : మండలంలోని పున్నేలు గ్రామానికి చెందిన మామునూరు ఉప్పలమ్మ, ఐనవోలు గ్రామానికి చెందిన వడిచర్ల కొమురమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఎండీ గౌస్‌పాషా కాలువిరగడంతో ఆయనను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ లీగల్‌సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్, మహిళ అధ్యక్షురాలు ఇల్లందుల ఎలిశా, అధికార ప్రతినిధి కొత్తూరు సునీల్, ఎస్సీ సెల్ యాకారపు సాంబయ్య, నాయకులు పోలెపల్లి బుచ్చిరెడ్డి, రాయపురం సాంబయ్య, తాండ్ర కోమలత, కత్తి దేవేందర్, సుధీర్, సారయ్య, నర్సయ్య, అశోక్, పరమేష్, మురళి, కుమారస్వామి, సంపత్ తదితరులు ఉన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : పెంచికలపేటలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సిరికొండ జంపయ్య కుటుంబాన్ని శనివారం సుమన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కలకోట్ల రాజేష్ పరామర్శించి ఆర్థికసాయం అందించారు. నరిగే రంజిత్, విజయ్, శ్రీకాంత్, ప్రసన్న, రవి, విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు



శాయంపేట : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం సాధించడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. తీన్మార్ మల్లన్న టీం మండల అధ్యక్షుడు తీన్మార్ జై, పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు రవి, రవిపాల్, సుదర్శన్, మార్కండేయ, నాగరాజు, శంకరచారి, రాజు, కట్టయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐనవోలు : మండలంలోని కొండపర్తి, వెంకటాపూర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో చెట్టు కొమ్మల తొలగింపు, లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పద్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అలంకారప్రాయంగా రైతుబజార్

- జీఎస్‌ఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు
- ప్రారంభంతోనే సరి..
- పునరుద్ధరించాలని రైతులు విజ్ఞప్తి

ఆత్మకూరు: మండల కేంద్రంలోని ఇప్పలకుంట శివారులో నాలుగు నెలల క్రితం స్థానిక ప్రజలతో పాటు సమీప గ్రామాల ప్రజలకు, వ్యాపారుల సౌకర్యార్థం రైతుబజార్ ప్రారంభించారు. ఈ రైతు బజార్‌ను దామెర మండలం ఊరుగొండకు చెందిన ఎన్నారై గొంది నరసింహారెడ్డి జీఎస్‌ఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో తన మిత్రుడు బూర గోపాలకృష్ణ స్మారకార్థం తన సొంత నిధులతో నిర్మించాడు. ఈ రైతు బజార్‌ను నాలుగు నెలల క్రితం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రారంభించారు. ప్రారంభ సమయంలో కూరగాయల వ్యాపారులకు కౌంటర్లను కేటాయించారు. ప్రతి శుక్రవారం రైతుబజారును నిర్వహించాలని భావించారు. అయితే మొదట్లో నామమాత్రంగా కొనసాగింది. మూడు నెలలుగా రైతుబజార్ నిరుపయోగంగా మారింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు రైతుబజారు ఆవరణ పూర్తిగా బురదమయంగా మారింది. రైతు బజారు పునరుద్ధరణకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు. రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని ఈ సందర్భంగా కోరారు.



మండల కేంద్రంలో నిరుపయోగంగా రైతు బజార్



బురదమయంగా మారిన రైతుబజార్ ఆవరణ

కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నాం..

ఆత్మకూరు గ్రామంలోని రైతుబజార్‌ను పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్నాం. గ్రామానికి దూరంగా ఉండటం వలన వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. వ్యాపారులతో మాట్లాడి రైతుబజార్ ప్రతివారం జరిగేలా చర్యలు తీసుకుంటాం.

\- యాదగిరి, పంచాయతీ కార్యదర్శి

భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి

నర్సంపేట : నర్సంపేటలో మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిద్ధు, పీడీఎస్‌యూ నాయకులు విజయ్, ఏఐఎఫ్‌డీఎస్ నాయకుడు శ్యామ్ డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం కళాశాల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, ఆర్‌డీఓ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించి సంబంధిత భవన నిర్మాణశాఖ, కాంట్రాక్టర్లకు ఈ విద్యాసంవత్సరానికి అందేవిధంగా చూడాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. కానీ కాంట్రాక్టర్లు ఇప్పటి వరకు భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే కలెక్టర్ స్పందించి మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి 2024–25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ భవనం ప్రారంభమయ్యే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో చింతం సిద్ధు, ప్రశాంత్, వినయ్, శ్రీకాంత్, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

శ్రమకు తగిన వేతనాలు ఇవ్వాలి

వరంగల్ చౌరస్తా: రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో టీజీ టాన్స్‌కోలో పనిచేస్తున్న గ్యాంగ్‌కవర్‌లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలపై పాలకులు స్పందించాలని ఆర్టిజన్ గ్రేడ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వడ్డేపల్లిలోని -327 యూనియన్ కార్యాలయంలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతోకాలంగా సీబీడీ గ్యాంగ్‌ల్లో పనిచేస్తూ ఆర్టిజన్లుగా సంస్థలో విలీనం చేసిన తర్వాత వారికి ఆర్టిజన్ గ్రేడ్ -1 జీతం ఇస్తూ వచ్చారని అన్నారు. ఆ తర్వాత విద్యార్హతతో వారి గ్రేడ్‌ను మార్చడం వలన వారి జీతం తగ్గిపోయిందని యూనియన్ నాయకుడు శ్రీధర్ తెలిపారు. సమావేశంలో గ్యాంగ్ ప్రతినిధి కల్యాణ్, మురళి, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం



మాధవి



సహస్ర

హసన్‌పర్తి: తల్లీకూతుళ్లు అదృశ్యమయ్యారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో బాధిత కుటుంబీకులు శనివారం ఫిర్యాదు చేశారు. గోపాలపురం మారుతి కాలనీకి చెందిన శ్రీశైలం ప్రైవేట్ ఉద్యోగి. అతని భార్య మాధవి, ఏడేళ్ల కూతురు సహస్ర ఈనెల 6వ తేదీన అదృశ్యమయ్యారు. బంధులు, కుటుంబ సభ్యుల ఇళ్లల్లో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులను శ్రీశైలం ఆశ్రయించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ తెలిపారు.

నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న, నాయకులు విద్యార్థులు

విద్యారణ్యపురి: ఇటీవల విడుదలైన నీట్‌పరీక్ష ఫలితాల్లో 67మందికి 720 మార్కులకు 720మార్కులతో ఆల్‌ఇండియా మొదటి ర్యాంకు రావడం, అందులో ఆరుగురు అభ్యర్థులు ఒకే పరీక్ష కేంద్రం నుంచే ఉండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. ఈక్రమంలో నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై న్యాయ విచారణ జరిపించి మళ్లీ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలో శనివారం ఆందోళన చేశారు. సర్క్యూట్ గెస్ట్ హౌస్ నుంచి పోలీస్ హెడ్‌క్వార్టర్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ సెంటర్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్ మాట్లాడుతూ నీట్ పరీక్షపై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని సూచించారు. మెడిసిన్‌లో ప్రవేశాలకు దేశవ్యాప్తంగా నిర్వహించి నీట్‌ను మళ్లీ నిర్వహించాలని కోరారు. అవకతవకలకు పాల్పడినట్లు తేలితే బాధ్యులపై చర్య తీసుకోవాలన్నారు.

దాశరథి'కి ఘన నివాళి

హన్మకొండ చౌరస్తా: సాహితీవేత్త, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దాశరథి రంగాచార్యుల వర్ధంతిని 5వ డివిజన్‌లోని హనుమాన్ నగర్ కాలనీ ఫేజ్–1లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీఆర్‌ఎస్ నాయకుడు చల్లా వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలో దాశరథి క్రియాశీల పాత్ర పోషించారని కొనియాడారు.

కమ్యూనిస్టు నేత భగవాన్‌దాస్‌కు నివాళి

హన్మకొండ చౌరస్తా: కమ్యూనిస్టు నాయకుడు బీఆర్ భగవాన్‌దాస్ 94వ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల జంక్షన్‌లోని భగవాన్‌దాస్ విగ్రహానికి ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్.నాగరాజు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాసరావు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ భగవాన్‌దాస్ పోరాటాల ఫలితంగానే వరంగల్ నగరానికి తాగునీరు వచ్చిందని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లో నిలదొక్కుకున్నానని అన్నారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ తాను చిన్నతనం నుంచి భగవాన్‌దాస్ పోరాట పటిమకు ఆకర్షితుడినై, ఆయన స్ఫూర్తితో ముందుకు సాగానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జ్యోతి, భిక్షపతి, కరుణాకర్, రమేష్, శ్రీనివాస్, భగవాన్‌దాస్ తనయులు డాక్టర్ రాజ్‌సిద్ధార్థ, అంబేడ్కర్, లెనిన్, మాజీ కార్పొరేటర్లు, జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కడియం, తదితరులు

ఉచిత శిక్షణతో ఉత్తమ ఫలితాలు



అధ్యాపకులను సన్మానిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: ప్రతిభగల అధ్యాపకుల పర్యవేక్షణలో విద్యార్థులకు శిక్షణ ఇస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి అన్నారు. గతంలో కాకతీయ యూనివర్సిటీలో వివిధ పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇచ్చిన అధ్యాపకులకు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేయూలో శిక్షణ తీసుకున్న పలువురు విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపి ఉద్యోగాలు సాధించారని ప్రశంసించారు. కోచింగ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ నాగయ్య మాట్లాడుతూ కేయూలో ఇచ్చిన ఉచిత కోచింగ్‌లో 69మంది కానిస్టేబుళ్లు, ముగ్గురు ఎస్సైలు, ఒకరు గ్రేడ్ -1 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్, జేఎల్ఎం ఉద్యోగానికి ఎంపికయ్యారని వివరించారు. అలాగే, గురుకులాల్లో పలువురు ఉపాధ్యాయ కొలువులు సాధించారని చెప్పారు. అనంతరం ఉచితంగా శిక్షణ ఇచ్చిన అధ్యాపకులు మధు, ప్రశాంత్‌రెడ్డి, డాక్టర్ వీరస్వామి, డాక్టర్ శంకర్, వీణను రిజిస్ట్రార్‌తో పాటు పలువురు సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ చందులాల్, డాక్టర్ రమేష్, రాజ్‌కుమార్, రాజేష్, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

మోదీని వ్యతిరేకించిన దేశ ప్రజలు

ఖిలా వరంగల్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని, కార్పొరేట్ విధానాలను దేశ ప్రజలు వ్యతిరేకించారని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నేత గుంగుల దయాకర్ అన్నారు. వరంగల్ ఫోర్ట్ రోడ్డు విద్యానగర్ కాలనీలో న్యూడెమోక్రసీ నాయకుడు రాచర్ల బాలరాజు అధ్యక్షతన శనివారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో దయాకర్ మాట్లాడారు. మోదీ ప్రభుత్వం ఈడీ, ఐటీ, సీబీఐ తదితర సంస్థలను అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష పార్టీల నాయకులను భయభ్రాంతులను గురిచేయడం, ప్రభుత్వాలను పడగొట్టడం, చీల్చడం చేస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. రైతు వ్యతిరేక మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని పోరాడుతున్న రైతాంగంపై ఉక్కుపాదం మోపడం బాధాకరమని వాపోయారు. కోటేశ్వర్‌రావు, రాజేందర్, కృష్ణ, రంజిత్ కుమార్, కృష్ణ, హరిబాబు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

దామెర : మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి సంస్థ కేస్ వర్కర్లు హరిత, వినీల అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గృహహింస, లైంగిక వేధింపులకు గురైన మహిళలకు కౌన్సిలింగ్, వైద్య సాయం, తాత్కాలిక వసతి, పోలీస్, న్యాయ సాయం వంటి ఐదు రకాల సాయం అదించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. సాయం పొందాల్సిన మహిళలు టోల్ ఫ్రీ నంబర్ 181 లేదా 08702452112కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళలతో పాటు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

ఫిష్‌పాండ్స్‌తో అధిక లాభాలు

- ఏపీఓ కీర్తి అనిత

శాయంపేట : సాధారణ పంట సాగుతో పాటు రైతులు తమ పంట క్షేత్రాల్లో ఫిష్‌పాండ్స్ నిర్మించుకొని అధిక లాభాలు పొందాలని ఏపీఓ కీర్తి అనిత శనివారం ఒక ప్రకటనలో కోరారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులు తమ పంట క్షేత్రాల్లో 20మీటర్ల పొడువు, 20మీటర్ల వెడల్పుతో ఫిష్‌పాండ్స్ నిర్మాణం చేపట్టుకున్నట్లయితే 100శాతం కూలీ డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేయనున్నట్లు తెలిపారు. మత్స్యశాఖ నుంచి ఉచితంగా చేప పిల్లలను అందిస్తామని అన్నారు. చేపలను పెంచి విక్రయించుకున్నట్లయితే అధిక లాభాలు వస్తాయన్నారు. రైతులందరూ ఫిష్‌పాండ్స్ నిర్మాణంపై దృష్టి సారించాలని కోరారు. వీటితో పాటు ఫిష్‌పాండ్స్ నిర్మాణం కూడా చేపట్టుకోవాలని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

పరకాల : పూర్వవిద్యార్థుల సమ్మేళనాలు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకోవడంతో పాటు గురువుల గౌరవాన్ని చాటిచెబుతున్నాయి. పట్టణంలో ఒకప్పుడు ప్రముఖ విద్యాసంస్థగా పేరుగాంచిన సీఎస్ఐ మిషన్ ఉన్నత పాఠశాలలో 1979–1980 సంవత్సరానికి చెందిన పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు 44 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. చిన్నప్పుడు పాఠశాలలో గడిపిన మధుర స్మృతులను, జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని సంతోషంగా గడిపారు. ఉన్నత చదువులతో దేశ, విదేశాలలో అత్యున్నత స్థానాల్లో స్థిరపడి నేడు చిన్న నాడు చదువుకున్న పాఠశాల వేదికగా 44 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు హైదరాబాద్ జీఎస్టీ అండ్ కస్టమ్స్ సూపరింటెండెంట్ విన్సెంట్ విజయ్‌కుమార్, సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్ అన్నారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.జే థామస్‌ను సన్మానించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులు డి.రవికుమార్, ఎంఎస్‌మూర్తి, ఎస్.నాగేశ్వర్‌రావు, ఎస్.సురేష్‌కుమార్, పి.రామారావు, బి.ప్రేమ్‌సాగర్, బి.ఆనందరావు, ఎం.స్వరూప, డి.కృప, ఎం.సుగు, ఆర్.ఎస్తేర్, ఎం.విమల, బి.వజ్ర పాల్గొన్నారు.

జనగామకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలి

నర్సంపేట: జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ పేరు పెట్టాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలో మోకుదెబ్బ జిల్లా కమిటీ సమావేశం శనివారం పట్టణ అధ్యక్షుడు గండి గిరిగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగిసినందున జనగామ జిల్లాకు కాంగ్రెస్ తమ ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించిన విధంగా సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ పేరు పెట్టేందుకు జీఓ జారీ చేయాలన్నారు. గతంలో మునుగోడు ఉపఎన్నికల్లో టీఆర్ఎస్ ప్రభుత్వం గౌడ ఆత్మీయ సమావేశంలో గీత కార్మికులకు సేఫ్టీ మోకులు, మోపెడ్‌లు ఇస్తామని వాగ్దానం చేసిందన్నారు. ఇచ్చిన హామీ నెరవేర్చనందునే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 12 శాతం ఉన్న గౌడ కులస్తులు రాజకీయాలకతీతంగా కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గెలిపించారని తెలిపారు. తాడి కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం మోకుదెబ్బ పట్టణ ఉపాధ్యక్షుడిగా శివకోటి గౌడ్‌ను నియమించి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గంప రాజేశ్వర్‌గౌడ్, మద్దెల సాంబయ్యగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు హరిప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు గండి గిరి, ఉపాధ్యక్షుడు గుండెబోయిన శివకోటి, దుగ్గొండి మండల అధ్యక్షుడు తడుక కొమురయ్య, ఉపాధ్యక్షుడు గుండెబోయిన రమేష్, గౌడ సంఘం సీనియర్ నాయకులు బొమ్మగాని సదానందం, పానకల్ గౌడ సంఘం అధ్యక్షుడు పిల్లల సురేష్‌గౌడ్, ఉపాధ్యక్షులు బండి రాజయ్య, రవీందర్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.



మోకుదెబ్బ పట్టణ ఉపాధ్యక్షుడిని సన్మానిస్తున్న రమేశ్‌గౌడ్

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

నర్సంపేట: ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు నాణ్యమైన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధిస్తున్న విద్య లభిస్తుందని మండల మానిటరింగ్ అధికారి కొర్ర సారయ్య అన్నారు. పట్టణంలో శనివారం బడిబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పిల్లలకు కావాల్సిన సౌకర్యాలను పాఠశాలల ప్రారంభం నాటికి పూర్తి కానున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనంతో పాటు పుస్తకాలు, దుస్తులు అందించడం జరుగుతుందన్నారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భిక్షపతి, అనిత, శైలజ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఉజ్వల భవిష్యత్

పర్వతగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే పిల్లలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రధానోపాధ్యాయుడు పి.సురేష్‌బాబు సూచించారు. మండలంలోని నారాయణపురంలో శనివారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే అన్ని రంగాల్లో ముందున్నారని అన్నారు. సామాజిక కార్యకర్త సైకిలాబ్‌బాబు మాట్లాడుతూ.. దూరప్రాంతాల్లో ఉన్నటువంటి ప్రైవేట్ పాఠశాలలకు తమ పిల్లలను పంపిచే క్రమంలో ఉదయం 7 గంటలకు వెళ్లి సాయంత్రం 6 గంటలకు రావడంతో వారు చేసే ప్రయాణంలో మానసిక ఒత్తిడికి గురవుతారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతి, సంపత్, అరవింద్‌కుమార్, ఎస్.గిరిజ, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

చేపలకు భలే గిరాకీ

సంగెం: మృగశిర కార్తె ప్రారంభం రోజున చేపలకు గిరాకీ పెరిగింది. తరతరాలుగా మృగశిరకార్తె రోజున తప్పకుండా చేపలు తినాలనేది ప్రజల నమ్మకం. దీంతో మండలంలోని పలు చెరువుల్లో మత్స్యకారులు చేపలవేటకు దిగారు. ఇతర మండలాల్లోని చెరువుల నుంచి చేపలను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. మండల కేంద్రంలో శనివారం మత్స్యకారులు పట్టిన చేపలను చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు ఎగబడి కొనుగోలు చేశారు. సాధారణ రోజుల్లో చేపలకు కిలోకు రూ .150 ఉండగా మృగశిర కార్తెను పురస్కరించుకుని రూ.200 వరకు అమ్మకాలు చేశారు.

